సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



టీడీపీ భూస్థాపితం ఖాయం

రాష్ట్రంలో టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. 8లో



ఆలోచింపజేసిన 'ఐదవ గది'

ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు అధికారులు, ఉద్యోగులు ప్రదర్శించిన ఐదవ గది నాటకం ఆలోజింపచేసింది. 8లో

ఎన్నికల నగారా



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు సంబంధించిన ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం వెల్లడించింది. 8లో

న్యూస్‌రీల్

పెట్రోల్ బంకుల్లో నాణ్యమైన సేవలు

డీఎస్‌వో శివప్రసాద్ ఆదేశం



పాడేరులోని పెట్రోల్ బంక్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్‌వో శివప్రసాద్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని డీఎస్‌వో రొంగలి శివ ప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పెట్రోల్‌బంక్‌ల వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేసే కార్యక్రమాన్ని గురువారం ఆయన పాడేరులో ప్రారంభించారు. తలారి సింగి రోడ్డులోని పెట్రోల్‌బంక్‌లో ఆయన తనిఖీలు చేపట్టారు. ఆయిల్‌లో నాణ్యతకు సంబంధించి శాంపిళ్లను సేకరించారు. అన్ని రికార్డులతో పాటు, బంక్ ఆవరణలో వినియోగదారులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను తనిఖీ చేశారు. వాటి వివరాలను ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి స్పందన రద్దు

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏలో శుక్రవారం జరగనున్న స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం వైఎస్సార్ కల్యాణమస్తు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి ఉన్నందున స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని తెలిపారు. గిరిజనులు వినతులు ఇచ్చేందుకు రావొద్దని ఆయన సూచించారు.

నేడు వైఎస్సార్ కల్యాణమస్తు ప్రారంభం

సాక్షి,పాడేరు: రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కల్యాణమస్తు కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభిస్తున్నారు. ఈమేరకు జిల్లాకు సంబంధించి స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆమె కార్యాలయ సిబ్బంది తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు,నామినేటెడ్ పదవుల నేతలు, వైఎస్సార్‌సీపీ నేతలు హాజరుకావాలని వారు కోరారు.

12న సీతమ్మతల్లి జెండా మహోత్సవం

హుకుంపేట: సీతమ్మతల్లి జెండా మహోత్సవాన్ని ఈ నెల 12న నిర్వహిస్తున్నట్టు జెండా కొండ సంక్షేమ సంఘ కమిటీ ప్రతినిధులు గులివిందుల జానకిరావు, కిల్లో సాధు, రాంబాబు తెలిపారు. తూర్పు కనుమల్లో అత్యంత ఎత్తయిన శిఖరంగా గుర్తింపు పొందిన సీతమ్మ పర్వతంపై కొలువైన సీతమ్మతల్లి అమ్మవారి ఉత్సవాన్ని ఏటా వైభవంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని తడిగిరి, మట్టుజోరు, రంగశీల పంచాయతీల నుంచే కాకుండా డుంబ్రిగుడ మండలంలోని గిరిజనులు ఉత్సవానికి తరలివస్తారని వారు పేర్కొన్నారు.

మరమ్మతులకు నిధులివ్వాలి

కేంద్ర గిరిజన సహాయ శాఖ మంత్రిని కోరిన అరకు ఎంపీ మాధవి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న అరకు ఎంపీ మాధవి

కొయ్యూరు: జీసీసీ గొడౌన్లు, డిపో భవనాల మరమ్మతులకు రూ.8.9 కోట్లు విడుదల చేయాలని కేంద్ర గిరిజన సహాయ శాఖ మంత్రి రేణుకసింగ్‌ను కోరినట్టు అరకు ఎంపీ మాధవి తెలిపారు. గురువారం పార్లమెంట్ హాల్‌లో ఆమెను కలిసి వినతిపత్రం సమర్పించినట్టు ఆమె పేర్కొన్నారు. మన్యంలో 257 జీసీసీ గొడౌన్లు, డిపోల మరమ్మతులకు రూ.8.9 కోట్లు ఇవ్వాలని కోరినట్టు ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా రూ.1.14కోట్లను నూతన డిపోల నిర్మాణాలకు కేటాయించాలని కోరామన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ పేర్కొన్నారు.

ఉపాధి కోసం వెళ్లి.. ఊపిరి వదిలి..

కుటుంబ పోషణ నిమిత్తం ఉపాధి కోసం వెళ్లిన వారిలో ఐదుగురి ప్రాణాలను విధి పొట్టన పెట్టుకుంది. ఆయా కుటుంబాలకు దిక్కులేని వారిని చేసింది. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటలోని ఆయిల్ ఫ్యాక్టరీలో సంభవించిన ప్రమాదం పెదబయలు మండలంలో విషాదం నింపింది. పోషించే దిక్కు కోల్పోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. ప్రమాద ఘటనతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసింది. సహాయక చర్యలు చేపట్టింది.

- కాకినాడ జిల్లా జి.రాగంపేటలోని ఆయిల్ ఫ్యాక్టరీ ప్రమాదంలో ఐదుగురు గిరిజనుల మృతి
- లక్ష్మీపురం, వంచేడిపుట్టు, చంపాపుట్టు గ్రామాల్లో విషాదం
- అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం
- బాధిత కుటుంబాలకు సహాయక చర్యలు



మృతుల కుటుంబాల నుంచి వివరాలు సేకరిస్తున్న పెదబయలు రెవెన్యూ అధికారులు

సాక్షి,పాడేరు/పెదబయలు/కొయ్యూరు: ఆయిల్ ఫ్యాక్టరీలో సంభవించిన ప్రమాదంలో ఐదుగురు గిరిజనుల మృతితో పెదబయలు మండలంలో విషాదం నెలకొంది. ఇదే మండలంలో పర్రెడ పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వెచ్చంగి నరసింగరావు (40), వెచ్చంగి కృష్ణారావు(36), వెచ్చంగి సాగర్ (23), వంచేడిపుట్టు గ్రామానికి చెందిన కుర్తాడి బొంజుబాబు(35), బొండాపల్లి పంచాయతీ చంపాపుట్టు గ్రామానికి చెందిన కొర్రా రామారావు(45) ఫ్యాక్టరీలో పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. వీరంతా ఫ్యాక్టరీలో ఆయిల్ ట్యాంకర్‌ను శుద్ధి చేస్తుండగా సంభవించిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. అదే ఫ్యాక్టరీలో ఈ ప్రాంతానికి చెందిన మరికొంతమంది కూలీలుగా పనిచేస్తుండటంతో వారి కుటుంబాలు ఆందోళనకు గురయ్యాయి.

రెండు వారాల క్రితమే..

వీరంతా సంక్రాంతి పండగకు వారం రోజుల ముందుగానే వచ్చారు. గ్రామంలో ఉంటున్న కుటుంబ సభ్యులతో ఎంతో సంతోషంగా గడిపారు. పండగను ఘనంగా జరుపుకున్నారు. వారు పనిచేస్తున్న ఆయిల్ ఫ్యాక్టరీకి గ్రామం నుంచి రెండు వారాల క్రితమే వెళ్లారు. పండగకు వచ్చిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో గడిపిన వారి మరణవార్త లక్ష్మీపురం, వంచేడిపుట్టు, చంపాపుట్టు గ్రామాల్లో విషాదం నింపింది. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



విషణ్ణవదనంలో మృతుల కుటుంబసభ్యులు

పోషించే దిక్కు కోల్పోయి..

ఐదుగురు గిరిజనుల మృతితో ఆయా కుటుంబాలు పోషించే దిక్కును కోల్పోయి వీధిన పడ్డాయి. ఆయిల్ ఫ్యాక్టరీలో రోజువారీ కూలీకి రూ.650 చెల్లిస్తున్నారు. దీంతో వారితో పాటు గ్రామానికి చెందిన మరికొంతమంది గిరిజనులు ఫ్యాక్టరీలో కూలీలుగా పనిచేస్తున్నారు. వారు అక్కడే ఉంటూ కూలి ద్వారా వచ్చే ఆదాయాన్ని కుటుంబసభ్యులకు పంపిస్తున్నారు. ఇలా ఎంతో సాఫీగా సాగిపోతున్న కుటుంబాల్లో ప్రమాద ఘటన తీవ్ర శోకం నింపింది.

అరణ్యరోదన

కొర్రా రామారావు మృతితో అతనిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల పరిస్థితి దయనీయంగా మారింది. భార్య కొమాలమ్మతోపాటు సన్యాసమ్మ, లక్ష్మి, పండుబాబు, శంకర్, రాధిక, సాయి, శేఖర్, మేరి సంతానం ఉన్నారు. వీరంతా చిన్నవయసు వారే. ఐదుగురు ప్రాథమిక విద్య చదువుతున్నారు. కుటుంబ యజమాని మృతితో వారంతా గుండెలవిసేలా రోదిస్తున్నారు.

దిక్కుతోచని స్థితిలో..

వెచ్చంగి కృష్ణారావుకు భార్య లక్ష్మితో పాటు కవిత, త్రినాథ్, వినీత, సంగీత, ప్రవీణ్ పిల్లలు ఉన్నారు. వీరంతో పదేళ్ల వయసు లోపు వారే. కుర్తాడి బొంజన్నకు భార్య నీలమ్మతో తండ్రి అర్జున్,పిల్లలు సాయి,బాలకృష్ణ,వెంకటలక్ష్మి,శ్రీవాణి ఉన్నారు. వీరు కూడా చిన్న పిల్లలే. పలు విద్యాలయాల్లో చదువుతున్నారు. వీరి చదువులు, జీవనోపాధికి పాటుపడుతున్న కుటుంబ యజమానుల మరణంతో వారంతా దిక్కుతోచని స్థితిలో ఆవేదన చెందుతున్నారు.

కుటుంబానికి బాసటగా ఉంటూ..

మృతుల్లో వెచ్చంగి సాగర్(23)కు వివాహం జరగలేదు. మూడవ తరగతి వరకు చదువుకున్నాడు. ఒక్కడే కావడంతో కుటుంబ బాధ్యతలన్నీ అతనిపై పడ్డాయి. ఆయిల్ ఫ్యాక్టరీలో కూలీగా పనిచేస్తూ వచ్చే ఆదాయంలో కొంత మొత్తాన్ని ప్రతి నెలా కుటుంబానికి పంపిస్తున్నాడు. ఇతనికి తల్లిదండ్రులు సీతారామ్, సత్యవతి, చెల్లెళ్లు ఉన్నారు. వీరికి ఏకష్టం రాకుండా అండగా ఉంటూ కుటుంబానికి బాసటగా నిలిచాడు. సాగర్ మృతితో తమకు దిక్కెవరంటూ వారంతా రోదిస్తున్నారు.



రోదిస్తున్న మృతుడు నర్సింగరావు భార్య పారతమ్మ

రాత్రి 9గంటలకు మాట్లాడా..

మృతుడు నర్సింగరావు భార్య పారతమ్మ

బుధవారం రాత్రి 9గంటలకు భర్త నర్సింగరావుతో మాట్లాడానని, తెల్లారసరికి దుర్వార్త వినాల్సి వచ్చిందని అతని భార్య పారతమ్మ గుండెలవిసేలా రోదించింది. నర్సింగరావుకు భార్యతోపాటు నలుగురు సంతానం ఉన్నారు. అదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్న గ్రామానికి చెందిన చంపాపుట్టు మత్స్యరాజుతో పంపిన రూ.2 వేలు అందుకున్నానని చెప్పానని, కొద్దిరోజుల్లో మళ్లీ డబ్బు పంపిస్తానని, జాగ్రత్తగా ఉండమని భర్త చెప్పాడని ఆమె కన్నీటి పర్యంతమైంది. ఎన్నో కష్టాలు పడుతూ తమను పెంచుతున్న పెద్ద దిక్కును కోల్పోయామని విలపించింది. కుటుంబాన్ని ఎలా పోషించాలని ఆవేదన చెందుతోంది.

కాకినాడకు మూడు అంబులెన్సులు

ఐదుగురు గిరిజనుల మృతదేహాలను శవ పరీక్షలు అనంతరం సొంత గ్రామాలకు తీసుకువచ్చేందుకు జిల్లా యంత్రాంగం మూడు అంబులెన్సులను గురువారం కాకినాడకు పంపింది. సహాయక కార్యక్రమాలపై కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఎస్పీ సతీష్‌కుమార్, పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్‌లు కాకినాడ కలెక్టర్,ఇతర అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కూడా అంబులెన్సులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. దీంతో పెదబయలు, పాడేరు తహసీల్దార్లతో పాటు అంబులెన్స్‌లను అక్కడకు పంపారు. బాధిత కుటుంబ సభ్యులు, పలువురు నేతలు కూడా వాహనాల్లో కాకినాడ వెళ్లారు.



కాకినాడ జీజీహెచ్ వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

సాక్షి ప్రతినిధి,కాకినాడ: రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు వారు..అయినవాళ్లను ఊరిలో వదిలి దూర ప్రాంతం నుంచి వచ్చినవారు కొందరైతే..దగ్గరున్న ఫ్యాక్టరీలో పనిచేసి కుటుంబాన్ని పోషించుకుందామని భావించిన వారు కొందరు.. తాము చేస్తున్న పని ఎంత ప్రమాదకరమైనదో గుర్తించలేని అమాయకులు వీరు..కనీస భద్రత లేని చోట తాము ఉపాధి పొందుతున్నామని గ్రహించని అభాగ్యులు..ఈ పరిస్థితులే ఏడుగురి ప్రాణాలు బలిగొన్నాయి. వీరిలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఐదుగురు ఉన్నారు. పెద్దాపురం మండలం జి. రాగంపేట వద్ద గురువారం అంబటి సుబ్బన్న ఆయిల్ ఫ్యాక్టరీ ట్యాంకర్ వద్ద జరిగిన దుర్ఘటనలో వీరు విగతజీవులైన వైనం హృదయాలను కలచి వేసింది.

కనీస భద్రత చర్యలు లేకుండా..

ఫ్యాక్టరీలో వంట నూనె ప్యాకింగ్ సెక్షన్‌లో కార్మికులకు ట్యాంకర్లను శుభ్రచేసే అనుభవం ఎంతమాత్రం లేదు. అటువంటి కార్మికులతో ట్యాంకులను శుభ్రం చేయించడమే ఒక తప్పు. 24 అడుగులు ఎత్తున ఉండే ట్యాంకులో కార్మికులు దిగేటప్పుడు కనీస భద్రతా చర్యలు తీసుకోవాలనే ఆలోచన కూడా లేకుండా పోయింది. దీనికి నిరుపేదలు తమ ప్రాణాలను మూల్యంగా చెల్లించాల్సి వచ్చింది.

అసలేం జరిగింది..

ఆయిల్ ఫ్యాక్టరీలోని ట్యాంకులోపల ఆక్సిజన్ స్థాయి 20శాతం ఉండేటట్టుగా చూడాలి. ట్యాంకుపై గాలి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలి. ట్యాంకుల్లోకి కార్మికులు దిగేటప్పుడు కనీసం వారికి ఆక్సిజన్ మాస్కులు కల్పించడ లేదని తాజా దుర్ఘటన స్పష్టం చేస్తోంది. 24 అడుగుల లోతున్న ట్యాంకుల్లో మడ్డి తొలగించేందుకు నైపుణ్యమున్న కార్మికులను మాత్రమే వినియోగించాలి. కానీ ఇలాంటి చర్యలేవీ యాజమాన్యం తీసుకున్న దాఖలా కనిపించలేదు. సామర్లకోట వద్ద ఏఎస్ ఆయిల్స్ కంపెనీయే రాగంపేటలో నువ్వులను నూనెగా తీసి ఇదే ప్లాంట్‌లోని ట్యాంకుల్లో నిల్వచేసి ప్యాకింగ్‌కు పంపిస్తుంది. ఈ నిల్వ ట్యాంకులకు అనుమతి ఉందా లేదా అనే దానిపై ఇప్పుడు అధికారులు విచారిస్తున్నారు. మెయిన్ ఫ్యాక్టరీకి ఉన్న అనుమతులతోనే ఇక్కడి ప్లాంట్‌లో ట్యాంకులు నిర్వహిస్తున్నారని తెలుస్తోంది.

మిన్నంటిన రోదనలు

రాగంపేట సంఘటన స్థలానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. మరో పక్క మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వారిని ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు.



ప్రమాదం జరిగిన ఆయిల్ ఫ్యాక్టరీ



ఫ్యాక్టరీలోని ఆయిల్ ట్యాంకర్లు



సొమ్మసిల్లిపోయిన మృతుడి కుటుంబ సభ్యుడు



జీజీహెచ్ మార్చురీ వద్ద రోదిస్తున్న బంధువులు



మార్చురీలోకి మృతదేహాన్ని తీసుకెళ్తున్న సిబ్బంది

ప్రమాద ఘటనపై తక్షణ స్పందన

ఆయిల్ ఫ్యాక్టరీలో ప్రమాద ఘటనపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఢిల్లీ లో ఉన్న అరకు ఎంపీ కాకినాడ, పాడేరు జిల్లా కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడారు. ఆమె భర్త, నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్ హుటాహుటిన సంఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఆయన మృతదేహాలను మోశారు.

సహాయక చర్యలు ముమ్మరం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కూడా కాకినాడ, అల్లూరి కలెక్టర్లు, పాడేరు సబ్‌కలెక్టర్‌తో మాట్లాడి సహాయక చర్యలు ముమ్మరం చేశారు. కొంతమంది నేతలను ఆయన కాకినాడ పంపారు. మృతుల కుటుంబాలు,పెదబయలు మండల అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలతోను ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు అన్నివిధాలా సాయం అందించేలా ఆయన తనయుడు శెట్టి వినయ్ కూడా అధికారులను అప్రమత్తం చేశారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు కూడా తక్షణ సహాయక కార్యక్రమాలు చేపట్టేలా అధికారులకు ఫోన్లో ఆదేశాలిచ్చారు.

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు మాట్లాడుతూ మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు.పెదబయలు ఎంపీపీ బొండా వరహాలమ్మ, హుకుంపేట జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేగం మత్స్యలింగం, సర్పంచ్ రవిశంకర్ బాధిత కుటుంబాలను పెదబయలులో పరామర్శించి వారిని ఓదార్చారు.



సహాయక కార్యక్రమాల్లో ఎంపీ భర్త శివప్రసాద్

జేఈఈ మెయిన్స్‌లో కూనవరం విద్యార్థి ప్రతిభ



కొమ్మాని శివరామ కృష్ణ

కూనవరం: జేఈఈ మెయిన్స్‌లో కూనవరం గ్రామానికి చెందిన కొమ్మాని శివరామకృష్ణ సత్తా చాటాడు. 99.14 పర్సంటైల్ సాధించాడు. రాజమండ్రి తిరుమల కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శివరామకృష్ణ టెన్త్ వరకు టేకులబోరు మాంటిస్సోరీ హైస్కూల్‌లో చదివాడు. రామకృష్ణను తల్లిదండ్రులు కొమ్మాని వీర్రాజు, సునీత దంపతులతో పాటు ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు అభినందించారు.

ఆలస్యంగా సూర్యోదయం

- కమ్మేస్తున్న మంచు తెరలు
- వణికిస్తున్న చలిగాలులు



రాజవొమ్మంగిలో కురుస్తున్న మంచు



మంచు తెరల్లో పాడేరు పట్టణం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో పొగమంచు తీవ్రత నెలకొంది. అర్ధరాత్రి నుంచి మంచు దట్టంగా కురుస్తుండడంతో ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. సూర్యోదయం ఆలస్యమవుతోంది. అరకులోయలో 11.4 డిగ్రీలు, మినుములూరులో 12 డిగ్రీలు, చింతపల్లిలో 15.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.రాత్రి నుంచి చలిగాలులు అధికమయ్యాయి.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పరిసరాల్లో గురువారం ఉదయం 9 గంటల వరకు మంచు దట్టంగా కురిసింది. చలితీవ్రత పెరిగింది. చలిమంటలతో ఉపశమనం పొందారు.

మాచ్‌ఖండ్‌లో విదేశీయుల సందడి



కెమెరాలతో బ్రెజిల్ దేశస్తులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన ఒనకఢిల్లీలో గురువారం జరిగిన వారపు సంత, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం వద్ద వివిధ దేశాలకు చెందిన 60 మంది విదేశీయులు సందడి చేశారు. వారపు సంతకు సరిహద్దులోని ఆంధ్రహల్, ఒనమనాల్ గ్రామాల నుంచి వచ్చే బొండా జాతి ఆదివాసీల వద్దకు వెళ్లి వారితో ఫొటోలు దిగారు. వారి ఆచారాలు, సంప్రదాయాల వివరాలను తెలుసుకున్నారు. వారి నుంచి పూసలు, కాండియాలు తదితర వస్తువులను కొనుగోలు చేశారు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం, వించ్ హౌస్, డుడుమ జలపాతాన్ని సందర్శించారు. జలవిద్యుత్ కేంద్రం పని తీరుపై ప్రాజెక్టు అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఫ్రెంచ్, లండన్, ఇటలీ, ఇజ్రాయిల్ ,బ్రెజిల్, కెన్యా, జర్మనీ, థాయిలాండ్, దక్షిణకొరియా, ఆస్ట్రేలియా తదితర దేశాలకు చెందిన విదేశీయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు



శ్రీకృష్ణపురం బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఎంహెచ్‌వో లీలాప్రసాద్

ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్

పాడేరు రూరల్: ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ఏజెన్సీలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తున్నామని ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్ తెలిపారు. మండలంలోని మినుములూరు పీహెచ్‌సీ పరిధిలోని శ్రీకృష్ణపురం బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం నిర్వహించిన శిబిరంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్ ఈ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి తీవ్రతను బట్టి మెరుగైన వైద్య సేవలు కల్పించేందుకు జిల్లా ఆస్పత్రులకు తరలిస్తున్నామని పేర్కొన్నారు. 603 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. వీరిలో 32 మందికి రక్తహీనత, చర్మ వ్యాధులు, దగ్గు, తక్కువ బరువు, కంటి చూపు, చెవి, దంత తదితర సమస్యలు ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. నలుగురు విద్యార్థినులకు ఇతర వైద్య పరీక్షల కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తామని చెప్పారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైతే వారిని జిల్లా ఆస్పత్రికి తరలించి అందించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనుమానిత సికిల్‌సెల్ ఎనీమియా కేసులను గుర్తించి తదుపరి నిర్ధారణ పరీక్షల కోసం జిల్లా ఆస్పత్రికి తరలించాలని సిబ్బందికి సూచించారు. వైద్యాధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది విధిగా వైద్య శిబిరాల్లో పాల్గొనాలని ఆదేశించారు. వసతి గృహంలో వంటశాలను పరిశీలించారు. వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి టి. విశ్వేశ్వరనాయుడు, వైద్యాధికారి కె.బాబ్జి, జిల్లా ఆస్పత్రి ఆర్‌బీఎస్‌కే మేనేజర్ కిషోర్, ఫిజియోథెరపిస్ట్ మౌనిక, ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

టీడీపీ భూస్థాపితం ఖాయం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- వైఎస్సార్‌సీపీలో 63 టీడీపీ కుటుంబాల చేరిక

అరకులోయ రూరల్: రాష్ట్రంలో టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని సిర్గం పంచాయతీ వర్ర గ్రామంలో గురువారం జరిగిన కార్యక్రమంలో టీడీపీకి చెందిన నాయకులు జన్ని అప్పలనాయుడు, కొర్రా సామరతో పాటు 63 కుటుంబాలు ఎమ్మెల్యే పాల్గుణ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి సాదరంగా పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతీరును చూసి ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఏనాడు ఎమ్మెల్యేలు శివారు గ్రామాల్లో సందర్శించిన సందర్భాలు లేవని, అయితే ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గ్రామాల్లో పర్యటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో టీడీపీ కనుమరుగు కావడం తథ్యమన్నారు. టీడీపీ విధానాలు, కుట్ర రాజకీయాలు నచ్చక ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలకతీతంగా పారదర్శకంగా అన్ని వర్గాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎంపీపీ ఉషారాణి, సర్పంచ్ కాంతమ్మ, నాయకులు బాలరాజు, చిరంజీవి, జన్ని మధునాయుడు, బాబూరావు, సుబ్బారావు, పొల్లన్న, అప్పన్న, మిన్ను, సాంబ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'ఐదవ గది'

ఆకట్టుకున్న జెన్‌కో ఉద్యోగుల నాటక ప్రదర్శన


దర్శకుడు కృష్ణేశ్వరరావును సత్కరిస్తున్న ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ శ్రీధర్ తదితరులు

మోతుగూడెం: ఏపీ జెన్‌కో ఉద్యోగులు ప్రదర్శించిన ఐదవ గది నాటకం ఆలోజింపచేసింది. ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ అధికారులు, ఉద్యోగులు బుధవారం రాత్రి మోతుగూడెం ఏపీ జెన్‌కో విద్యుత్ కళాభారతిలో ఈ నాటకాన్ని ప్రేక్షక హృదయాలను హత్తుకునేలా ప్రదర్శించారు. నేటి సమాజానికి దగ్గర పాత్రలతో ప్రదర్శించిన ఈ నాటకంలో దురాశతో మనుషుల ఎలా మారుతున్నారో కళ్ల కట్టినట్లు చూపారు. మానవుని హృదయానికి నాలుగు గదులు ఉంటాయి.. బంధాలు.. అప్యాయత, ప్రేమ, అనురాగాలతో మనిషి ఐదవగదిని ఏర్పరుచుకోవాలి, కాని నేటి సమాజంలో డబ్బు, అత్యాశ, దురాశతో ఐదవగది తెరుచుకోకూడదని సందేశాత్మకంగా ప్రదర్శించారు. ఈ నాటకానికి డీఈ బాలకృష్ణ దర్శకత్వం వహించారు. ప్రదర్శనకు సివిల్ ఈఈ బాబూరావు ఆధ్వర్యం వహించారు. సంగీతం రాజశేఖర్, సెట్టింగ్‌లకు కొట్టు శ్రీను, రత్నాకర్, వాసు తదితరులు సహకారం అందించారు. ఈ ప్రదర్శనకు విచ్చేసిన ప్రముఖ సినీ రచయిత, నటుడు, దర్శకుడు వీఎస్ కృష్ణేశ్వరరావును ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ శ్రీధర్ చేతుల మీదుగా సత్కరించారు. అప్పర్ సీలేరు డీఈ లక్ష్మీనారాయణ, జ్యోతి(విజయనగరం), బీకేఎస్ఎస్. ప్రసాద్, వర్మ, బాలాజీ, సతీష్, సెల్వరాజు, లక్ష్మణరావు, కిరణ్ పాల్గొన్నారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): భద్రతాకారణాల దృష్ట్యా కేకే లైన్‌లో నడిచే ప్రయాణికుల రైళ్ల గమ్యం కుదించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. 10 తేదీన కిరండూల్‌లో బయలుదేరవలసిన కిరండూల్–విశాఖపట్నం(18513)ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయలుదేరుతుంది. • విశాఖపట్నంలో ఈనెల 10న బయల్దేరే విశాఖపట్నం- కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రైలు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో 10,11 తేదీల్లో కిరండూల్‌లో బయల్దేరవలసిన కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ రైలు కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. అయా తేదీల్లో ఈ రైళ్లు దంతేవాడ-కిరండూల్ మధ్య రాకపోకలు సాగించవు.

ఎన్నికల నగారా

పట్టభద్రుల పోరుకు రంగం సిద్ధం



- 16న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్
- మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్
- ఈ నెల 9 నుంచి ఉత్తరాంధ్రలో అమల్లోకి ఎన్నికల కోడ్
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- ఉత్తరాంధ్రలో 2,82,348 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు
- 338 పోలింగ్ స్టేషన్లు, 694 బ్యాలెట్ బాక్సులు
- 6 జిల్లాల్లో 1,860 మంది పోలింగ్ అధికారులు


ఓటరు జాబితా, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు తదితర అంశాలపై రాష్ట ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

సాక్షి, విశాఖపట్నం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు సంబంధించిన ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం వెల్లడించింది. దీంతో ఎన్నికల వేడి ఉత్తరాంధ్రలో రాజుకుంది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్‌ను ప్రకటించగా.. బీజేపీ, పీడీఎఫ్‌లు తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. మరోవైపు టీడీపీ చివరి నిమిషంలో అభ్యర్థిని మార్చడంతో నేతల్లోనే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు షెడ్యూల్ విడుదల కావడంతో అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గురువారం నుంచే ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున ప్రకటించారు.

ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం

షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా జిల్లా కలెక్టర్, అడిషనల్ రిటర్నింగ్ అధికారులుగా ఆయా జిల్లాల డీఆర్‌వోలు వ్యవహరించనున్నారు. బ్యాలెట్ బాక్సులు ఎన్ని ఉన్నాయి.? పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లు, సున్నితమైన పోలీస్ స్టేషన్లు, ఓటరు జాబితాలు, పోలింగ్ స్టేషన్‌ల్లో సిబ్బంది, అధికారుల కేటాయింపు తదితర అంశాలపై తలమునకలవుతున్నారు. కలెక్టర్ డా. మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎప్పటికప్పుడు ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

రాజుకున్న రాజకీయ వేడి

ఈసారి రాజకీయపక్షాలు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలపై ముందుగానే ఎన్నికలపై దృష్టిసారించాయి. అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్‌ని ప్రకటించగా.. ఆయన ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇక బీజేపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్సీ మాధవ్ కొనసాగుతున్నారు. పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) అభ్యర్థిగా డా.కోరెడ్ల రమాప్రభని ఎంపిక చేశారు. ప్రధాన ప్రతిపక్షం టీడీపీ మాత్రం చిన్నికుమారి లక్ష్మిని పక్కన పెటి డా. చిరంజీవిరావు తమ ఎమ్మెల్సీ అభ్యర్థి అంటూ తెరపైకి తీసుకొచ్చింది. ఈ విషయంలో చంద్రబాబు వ్యవహార శైలి ఉత్తరాంధ్ర టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మింగుడుపడటం లేదు.

పోలింగ్ స్టేషన్ల వివరాలు

జిల్లా	పోలింగ్ స్టేషన్లు	సహాయక స్టేషన్లు	మొత్తం పోలింగ్ స్టేషన్లు
శ్రీకాకుళం	57	02	59
విజయనగరం	64	06	70
పార్వతీపురం మన్యం	24	00	24
అల్లూరి సీతారామరాజు	14	01	15
విశాఖపట్నం	94	28	122
అనకాపల్లి	44	04	48
మొత్తం	297	41	338

నోటిఫికేషన్ వివరాలివీ..

- షెడ్యూల్ విడుదల : ఈనెల 16
- నామినేషన్ల స్వీకరణ ప్రారంభం : ఈనెల 16
- నామినేషన్ల ముగింపు : ఈనెల 23
- నామినేషన్ల పరిశీలన : ఈనెల 24
- నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ : ఈనెల 27
- పోలింగ్ తేదీ : మార్చి 13వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు
- కౌంటింగ్ తేదీ : మార్చి 16
- ఎన్నికల ప్రక్రియ ముగిసే తేదీ : మార్చి 21

జిల్లాల వారీగా ఓటర్లు

జిల్లా	ఓటర్లు	పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు
శ్రీకాకుళం	51,025	136
విజయనగరం	57,568	536
పార్వతీపురం మన్యం	18,307	188
అల్లూరి సీతారామరాజు	11,350	346
విశాఖపట్నం	1,03,243	2662
అనకాపల్లి	40,855	869
మొత్తం	2,82,348	4,737

అప్పుడు 1.70 లక్షలు.. ఇప్పుడు 2.82 లక్షల ఓటర్లు

2017లో జరిగిన ఎన్నికల్లో 1.70 లక్షల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదవ్వగా 69.7 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. ఈసారి 2.82 లక్షలకు పైగా ఓటర్లు నమోదైన తరుణంలో పోలింగ్ శాతం కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం నుంచి 2017లో ఎన్నికైన పీవీఎన్ మాధవ్ పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది.

అవసరమైన బ్యాలెట్ బాక్సులు

జిల్లా	500 ఓట్ల బాక్సులు	రిజర్వ్	ఇతర బాక్సులు	మొత్తం బాక్సులు
శ్రీకాకుళం	103	21	00	124
విజయనగరం	116	23	00	139
పార్వతీపురం మన్యం	37	07	00	44
అల్లూరి సీతారామరాజు	23	05	02	30
విశాఖపట్నం	207	41	08	256
అనకాపల్లి	82	16	03	101
మొత్తం	568	113	13	694

పోలింగ్ అధికారుల వివరాలు

జిల్లా	పీవో	ఏపీవో	ఓపీవో	రిజర్వ్	మొత్తం	మోనటరింగ్ అధికారి
శ్రీకాకుళం	59	59	177	30	325	59
విజయనగరం	70	70	210	35	385	70
పార్వతీపురం	24	24	72	12	132	24
అల్లూరి	15	15	45	08	83	15
విశాఖపట్నం	122	122	366	61	671	122
అనకాపల్లి	48	48	144	24	264	48
మొత్తం	338	338	1014	170	1860	338

విశాఖ శిశువిహార్‌కు శిశువు అప్పగింత


శిశువును శిశువిహార్ అధికారులకు అప్పగిస్తున్న సీడీపీవో ఝాన్సీరాణి

సాక్షి,పాడేరు: రెండు రోజుల క్రితం పాడేరు జిల్లా ఆస్పత్రిలో తల్లి వదిలిపెట్టిన శిశువును గురువారం విశాఖలోని శిశు విహార్‌కు సీడీపీవో ఝాన్సీరాణి అప్పగించారు. ఆడబిడ్డకు జన్మనిచ్చిన గుర్తు తెలియని మహిళ ఆస్పత్రి ఆవరణలోనే విడిచిపెట్టడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు పాడేరు పోలీసుస్టేషన్, ఐసీడీఎస్ సీడీపీవోలకు సమాచారం ఇచ్చారు. ఆస్పత్రిలోని సీసీ టీవీ పుటేజీల క్లిప్‌లను విడుదల చేసినప్పటికి బిడ్డను వదిలిపెట్టిన తల్లి ఆచూకీ కానరాలేదు. ఈ ఆడశిశువుకు జిల్లా ఆస్పత్రిలో వైద్యపరీక్షలు జరిపి, సంరక్షించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సీడీపీవో ఝాన్సీరాణి, సూపర్‌వైజర్ ఉమాలు శిశువును విశాఖ శిశువిహార్‌కు అప్పగించారు.

రత్నంపేటలో సారా బట్టీలపై పోలీసుల దాడి


పోలీసులు స్వాధీనం చేసుకున్న వంటపాత్రలు

కొయ్యూరు: ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు కొయ్యూరు పోలీసులు రత్నంపేటలో మూడు వేల లీటర్ల సారా పులుపును ధ్వంసం చేశారు. సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో గురువారం మహిళా పోలీసులు, ఎస్ఐ రాజారావుతో కలిసి సారా బట్టీలపై దాడులు చేశారు. సారా కాస్తున్న ప్రాంతాలపై పక్కా సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేశారు. మూడువేల లీటర్ల పులుపును ధ్వంసం చేశారు. అదే విధంగా సారా తయారీకి ఉపయోగించే వంటపాత్రలను కూడా ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సారా తయారీ, విక్రయాలు నేరమన్నారు. నిందితులకు ఏపీ ఎక్సైజ్ ప్రొహిబిషన్ చట్టం ప్రకారం ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందని తెలిపారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రంగురాళ్ల తవ్వకాలు జరిపితే చర్యలు


గోతిని పూడ్చి వేయిస్తున్న పోలీసు, అటవీ సిబ్బంది

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ బాలరేవుల సమీపంలో గతంలో రంగురాళ్ల తవ్వకాల కోసం తవ్విన గోతులను మంప ఎస్ఐ లోకేష్‌కుమార్, ఫారెస్టు అధికారి సింహాద్రి ఆధ్వర్యంలో గురువారం మూసివేశారు. పోలీసులు, స్థానికుల సహాయంతో గోతిని గాజు పెంకులు, రాళ్లతో పూడ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ లోకేష్‌కుమార్ మాట్లాడుతూ రంగురాళ్ల తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో రంగురాళ్ల తవ్వకాలు చేస్తున్నట్టు తెలిస్తే తమకు సమాచారం అందించాలని స్థానికులను కోరారు. అటవీ సిబ్బంది దుర్గాప్రసాద్, రాకేశ్ తదితరులున్నారు.

గృహ సారథులు వారధులుగా నిలవాలి

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: గృహ సారథులు ప్రభుత్వ పథకాల అమలులో వారధులుగా నిలవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రింతాడలో గురువారం గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత వలంటీర్లు, గృహ సారథులేదనన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. అందుకు గృహసారథులు, వలంటీర్లు వారధులుగా నిలవాలన్నారు. ప్రభుత్వం ప్రజలకోసం వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. సమావేశానికి హాజరైన గృహ సారథులకు బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. ఎంపీపీ బోయిన కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు శివరత్నం, మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, వైస్ ఎంపీపీ దేముడు, సర్పంచ్‌లు లక్ష్మి, రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జైతు రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన గుడ్ల ఎంపికతో మంచి దిగుబడి

కేంద్ర టసర్ పరిశోధన, శిక్షణ సంస్థ డైరెక్టర్ సత్యనారాయణ


మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణ

కూనవరం: రైతులు దసిలి పట్టు పురుగుల పెంపకంలో నాణ్యమైన గుడ్లను ఎంపిక చేసుకోవడం ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చని కేంద్ర టసర్ పరిశోధన, శిక్షణ సంస్థ (రాంచీ) డైరెక్టర్ డాక్టర్ కె. సత్యనారాయణ సూచించారు. మండలంలోని పైదిగూడెంలో దసలి సాంకేతిక వ్యాప్తి మరియు అనుభవ భాగస్వామ్యంపై గురువారం రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టు గూళ్ల నిర్వహణలో రైతులు తగిన ప్రమాణాలను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందించే మంచి విత్తన గూళ్లను ఎంచుకుంటే దిగుబడి బాగుంటుదన్నారు. పట్టు పురుగులను మూడ దశల్లో జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. మద్దిచెట్లకు లేత ఆకులను తొలగించిన అనంతరం పట్టు పురుగులను ఎక్కించాలన్నారు. పురుగులు బలంగా పెరిగితేనే పట్టకాయల దిగుబడి పెరుగుతుందన్నారు. సున్నం, బ్లీచింగ్ చల్లడం ద్వారా ఆకులను నాశనం చేసే కీటకాలను తొలగించవచ్చని సూచించారు. చనిపోయిన పట్టు పురుగులను గొయ్యితీసి పూడ్చి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీటీఎస్ఎస్‌వో బిలాయిపూర్ డైరెక్టర్ వేణుగోపాల్, స్టేట్ సెరికల్చర్ అదనపు డైరెక్టర్ అరుణకుమారి, ప్లానింగ్ ఏడీ బేగం, కాకినాడ డీఎస్‌వో రామరాజు, సెరికల్చర్ ఎస్‌వో రాంబాబు, అటవీశాఖ డీఆర్వో రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కొడుకు చేతిలో తండ్రి హతం

పోచవరం గ్రామంలో దారుణం


పోతిరెడ్డి మృతదేహం

వీఆర్‌పురం: తన అవసరాలకు అడిగిన సొమ్ములు ఇవ్వలేదన్న ఉక్రోషంతో కొడుకు కన్నతండ్రిని కర్రతో కొట్టి చంపిన ఘటన మండల పరిధి పోచవరం గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పోచవరం గ్రామానికి చెందిన విద్యా పోతిరెడ్డి(53) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. కాగా అతడికి ఇటీవల పోలవరం నష్టపరిహారం వచ్చింది. ఈ క్రమంలో అతని కుమారుడు విద్యా రాజురెడ్డి ఏపనీ చేయకుండా ఖాళీగా తిరుగుతూ తన జల్సాలకు బ్యాంక్‌లో దాచిన డబ్బులు ఇవ్వాలని తండ్రిని తరచూ వేధించేవాడు. డబ్బులు ఇస్తే వృధాగా ఖర్చు చేస్తాడని అడిగినంత కాకుండా కొంచెం మొత్తంలోనే తండ్రి డబ్బులు ఇచ్చేవాడు. కాగా బుధవారం రాత్రి డబ్బులు మొత్తం తనకి ఇవ్వాలని తండ్రితో రాజురెడ్డి ఘర్షణకు దిగాడు. అయినా ఉన్న డబ్బులన్నీ నీకే కాక ఇంకెవరికి ఇస్తాను భవిష్యత్ అవసరాలకు ఉంచుకోకుండా అంతా ఇప్పుడే ఖర్చు చేస్తే ఎలా అని కుమారుడుకి నచ్చి చెప్పాడు. అయినా కుమారుడు వినిపించుకోకుండా ఇంటి ఆవరణలో ఉన్న కర్రతో తండ్రి ముఖంపై తీవ్రంగా కొట్టాడు. దీంతో అతడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రక్తపు మడుగులో పడిన్న పోతిరెడ్డిని కుటుంబ సభ్యులు హుటా హుటిన కూనవరం మండలంలోని కోతులగుట్ట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి పోతిరెడ్డి మృతిచెందినట్టు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి.దుర్గాప్రసాద్ తెలిపారు. రాజురెడ్డి పరారీలో ఉన్నాడని ఆయన చెప్పారు.

టెస్టుల్లో మన భరత్

విశాఖ నుంచి తొలి ఆటగాడు



విశాఖ స్పోర్ట్స్: తెలుగు కుర్రాడు, ఆంధ్ర రంజీ ప్లేయర్, విశాఖ వాసి కోన శ్రీకర్ భరత్ చిరకాల కల నెరవేరింది. సుదీర్ఘ నిరీక్షణకు ఫలితం దక్కింది. ప్రతిష్టాత్మక బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ 2023 సందర్భంగా భరత్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. టీమిండియా టెస్ట్ స్పెషలిస్ట్ చేతేశ్వర్‌పుజారా చేతుల మీదుగా టీమిండియా క్యాప్ అందుకున్నాడు. భరత్ జెర్సీ నంబర్ 14. యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ గాయం కారణంగా భారత జట్టుకు వికెట్ కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తించే అవకాశం మనోడికి దక్కింది. ఎన్నో ఏళ్ల ఎదురు చూపులకు ఇప్పుడు ఫలితం దక్కింది. టీమిండియా తరఫున ఆడటం ఆనందంగా ఉందని భరత్ తెలిపాడు. తొలి టెస్ట్ ఆడుతున్న భరత్‌ను ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి, కార్యదర్శి గోపీనాథ రెడ్డి అభినందించారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్, జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మరిన్ని మ్యాచ్‌లు ఆడాలని ఆకాంక్షించారు. ఆంధ్ర తరఫున ఇప్పటికే ఎంఎస్‌కే ప్రసాద్ టెస్ట్‌లాడగా... విశాఖ నుంచి మాత్రం భరత్ తొలి ఆటగాడుగా నిలిచాడు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

నక్కపల్లి : జాతీయ రహదారిపై నక్కపల్లి ఐవోబీ సమీపంలో గురువారం లారీ ఢీకొనడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రమణయ్యపేటకు చెందిన కర్రి అప్పారావు బ్యాంకు పని మీద నడచి వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో అప్పారావు చేయి నుజ్జయింది. వెంటనే అతన్ని 108 వాహనంలో నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి అక్కడనుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. జాతీయ రహదారి మరమ్మతు పనులు చేపట్టడం వల్ల స్టాపర్లు ఏర్పాటు చేయడంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదం సంభవించినట్టు తెలుస్తోంది.